




వాస్తవాలు పలుకు DD9 వార్త

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక


శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత




హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 26 | 07-06-2026 ఆదివారం | పేజీలు: 06 | వెల: 3/-


# జోరుగా డబుల్ బెడ్ రూమ్ దందా!!



**కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.**

**పేదల కోసం నిర్మించిన గృహాలు కొందరికి ఆదాయ వనరులుగా మారాయా.?**

**అధికారుల తనిఖీలకే ముందస్తు సమాచారం ఎలా చేరుతోంది?**

**రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తరహాలో దందా జోరు.?**

**వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్.**

**హైదరాబాద్ జూన్ 06(డిడి9 వార్త):** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం గృహాలు రాష్ట్రవ్యాప్తంగా అక్రమ దందాలకు కేంద్రాలుగా మారుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి. కొల్లూరు డబుల్ బెడ్‌రూం కాలనీల్లో వెలుగుచూస్తున్న ఆరోపణలు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇదే తరహా

..మిగతా 2లో

# సింగరేణిలో భారీ కుంభకోణం..



**రూ.1,600 కోట్ల బొగ్గు మాయంపై న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్**

**సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైనట్లు కేటీఆర్ ఆరోపణ**

**సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు డిమాండ్**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసి విచారణ కోరిన కేటీఆర్**

**హైదరాబాద్ జూన్ 06(డిడి9 వార్త):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL)లో సుమారు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు (కేటీఆర్) సంచలన ఆరోపణలు చేశారు. ఈ భారీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి

..మిగతా 2లో

# రేవంత్ ప్రభుత్వంలో లక్ష కోట్ల భూదోపిడీ..

**రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమి పెద్దలకు కేటాయిస్తున్నారని విమర్శ**

**భూదందాలో సీఎం కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందని వ్యాఖ్య**

**హైడ్రా చర్యలు పేదలపై లక్ష్యంగా ఉన్నాయని ఆరోపణ**

**సుప్రీంకోర్టు వరకు వెళ్లి భూములు కాపాడుతామని హెచ్చరిక**

**శ్రీ ఆదిత్య కంపెనీ ప్రాజెక్టుపై ఎంపీ ప్రమేయం ఉందని వ్యాఖ్య**

**జలవనరుల అంశంలో ప్రభుత్వంపై విమర్శల వర్షం**

**మహారాష్ట్ర, ఏపీ నీటి వ్యవహారాలపై రేవంత్‌పై ప్రశ్నలు**

**పవన్ కల్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కవిత**

**తెలంగాణ జాగీర్ కాదని, రాజకీయ జోక్యాన్ని సహించమని హెచ్చరిక**



**హైదరాబాద్ జూన్ 06(డిడి9 వార్త):** కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. శనివారం మీడియాతో మాట్లాడిన ఆమె, రేవంత్ రెడ్డి సర్కార్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ప్రభుత్వ పెద్దలకు రూ.లక్ష కోట్ల విలువైన భూములు అప్పగిస్తున్నారని, ఇందులో సీఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని ఆమె ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తామని కవిత స్పష్టం చేశారు. హైడ్రా చర్యలు పేదల కాలనీలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని, అదే సమయంలో పెద్దలకు భూములు అప్పగిస్తున్నారని ఆమె మండిపడ్డారు.
శ్రీ ఆదిత్య కంపెనీ ప్రాజెక్టు విషయాన్ని ప్రస్తావిస్తూ, రివర్ బెడ్‌పై నిర్మాణాలు జరుగుతున్నాయని, ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారని ఆరోపించారు. అయితే ఆ కంపెనీకి అనుమతులు గత BRS ప్రభుత్వ హయాంలోనే ఇచ్చారని కూడా ఆమె వ్యాఖ్యానించారు. "దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా?" అని ప్రశ్నించారు.
రాష్ట్రంలో నీటి వనరుల నిర్వహణపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నీటి వ్యవహారాలపై అవగాహన లేదని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర సీఎం

..మిగతా 2లో

# నన్ను మభ్యపెట్టడం అంత ఈజీ కాదు

**కామన్ సెన్స్‌తోనే ఎక్కువ సమస్యలకు పరిష్కారం: సీఎం**

**రోజుకు 16-18 గంటలు పనిచేస్తా**

**వ్యతిరేక వార్తల నుంచీ సమాచారం సేకరిస్తా**

**కేసీఆర్ మీడియా ప్రతినిధులను కూడా పిలుస్తా**

**యువతను క్రీడల వైపు మళ్లించడమే లక్ష్యం**

**ఫుట్‌బాల్‌పై ఆసక్తితోనే మెస్సీని తీసుకొచ్చాం**

**పాలనపై జర్నలిస్టుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటా**

**పెద్దల చెరువు ఆక్రమణలను సహించం**

**హైడ్రా తర్వాత కబ్జాలపై భయం పెరిగింది**

**చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు**

**విమర్శలను కూడా స్వాగతిస్తా: సీఎం**



**హైదరాబాద్ జూన్ 06(డిడి9 వార్త):** తనను మభ్యపెట్టడం అంత ఈజీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అనేదే ముఖ్యమని.. కామన్ సెన్స్‌తో సమస్యలు పరిష్కారం చేసేవే ఎక్కువ అని తెలిపారు. తాజాగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను కేసీఆర్ మీడియా పీపుల్స్‌ను కూడా మీడియా సమావేశానికి పిలుస్తానన్నారు. వాళ్ళ మైండ్ సెంట్ ఏంటో తెలుసుకుంటానని చెప్పారు. తనకు వేరే ఏ పని లేదని.. 16 నుంచి 18 గంటలు పని చేస్తానన్నారు. తాను ఫుట్‌బాల్ ఆడతానని.. అందుకే మెస్సీని తీసుకువచ్చినట్లు తెలిపారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనేది

..మిగతా 2లో

# జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ధర్నా

**జంతర్ మంతర్‌లో నిరసనకు పోలీసుల అనుమతి**

**ఢిల్లీ చేరుకున్న పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే**

**మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్**

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిన ఢిల్లీ పోలీస్**



**న్యూ ఢిల్లీ జూన్ 06(డిడి9 వార్త):** నీట్ యూజీ2026 ప్రశ్నపత్రాల లీకేజీ, సీబీఎస్ఈ ఆన్ స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానంలో తలెత్తిన తీవ్ర లోపాలు, సాంకేతిక అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలనే ప్రధాన డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కదం తొక్కింది. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా శనివారం భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. వందలాది యువత, పోటీ పరీక్షల అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు వందలాదిగా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం పక్కన పెట్టి, ప్రభుత్వం తమ సోషల్ మీడియా ఖాతాలను నిలిపివేయడం, పోస్టులను డిలీట్ చేయడం వంటి చర్యలపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే మండిపడ్డారు. ''మీరు మా పోస్టులను డిలీట్ చేయగలరేమో కానీ, ఈ స్థలం నుంచి మమ్మల్ని తొలగించలేరు'' అని ఘాటైన హెచ్చరికలు చేశారు. నిరసనకారులను ఉద్దేశించి అభిజీత్ దిప్కే మాట్లాడుతూ, ప్రభుత్వ బెదిరింపులకు వెనకడుగు వేసేది లేదని

..మిగతా 2లో

# రేవంత్.. పోటీకొస్తవా.. నువ్వో నేనో తేల్చుకుందాం

**బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నారని సీఎం గుర్తుంచుకోవాలి**

**గౌరవప్రదంగా మాట్లాడితే అందరికీ గౌరవం ఉంటుంది**

**బూతుల పోటీకి వస్తే మేమూ సిద్ధమే: ఎంపీ**

**మీరు ఒకటి అంటే మేము నాలుగు అనగలం**

**గణాంకాలపై ఎక్కడైనా చర్చకు సిద్ధం**

**రైతుల కోసం కేంద్రం పనిచేస్తోందనడానికి MSP పెంపే నిదర్శనం**

**2014తో పోలిస్తే వడ్ల MSP గణనీయంగా పెరిగింది**

**విమర్శలకు లెక్కలతో సమాధానం ఇస్తాం: రఘునందన్**



**హైదరాబాద్ జూన్ 06(డిడి9 వార్త):** కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అనే బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నారనే విషయం మరిచిపోవద్దని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సీఎం స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి గౌరవప్రదంగా మాట్లాడితే మీకు మాకు గౌరవంగా ఉంటుందన్నారు. అలా కాదని ఎవరు ఎక్కువగా బూతులు మాట్లాడుతారో పోటీ పెట్టుకుందామంటే


..మిగతా 2లో

# చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు

**సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే హక్కు రేవంత్ కు లేదన్న హరీశ్**

**కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదని వ్యాఖ్య**

**ఈ ఏడాది 75 శాతం కృష్ణా నీటిని ఏపీ వాడుకుందని ఆరోపణ**



**హైదరాబాద్ జూన్ 06(డిడి9 వార్త):** పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. నేడు ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన హరీశ్ రావు... బీఆర్ఎస్

..మిగతా 2లో

# రేవంత్ ప్రభుత్వంలో లక్ష కోట్ల భూదోపిడీ..

**మొదటిపేజీ తరువాయి**

అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ సీఎంతో చర్చించి 200 టీఎంసీల నీళ్లు తీసుకువచ్చిన తర్వాతే బనకచర్ల అంశంపై మాట్లాడాలని సూచించారు.

పాలన వ్యవస్థపై వ్యాఖ్యలు చేస్తూ, "అప్పుడు కేటీఆర్ పాలన నడిచింది, ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోంది" అని అన్నారు. కేటీఆర్ అనే పేరుకు గతంలోనూ, ప్రస్తుతం కూడా విభిన్న అర్థాలు ఉన్నాయని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కూడా ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఎవరి జాగీర్ కాదని, పవన్ కల్యాణ్ రాజకీయ జోక్యం అంగీకరించబోమని హెచ్చరించారు. ఆయనకు మద్దతు ఇస్తే బీజేపీకి నాలుగు ఓట్లు వస్తాయని భావిస్తోందని, కానీ వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఉన్న సీట్లు కూడా తగ్గుతాయని అన్నారు.

అలాగే పవన్ కల్యాణ్ 10 ఎకరాల శిఖం భూమి కొనుగోలు చేశారని, కోడికుంట సర్వే నంబర్ 706లో ఆ భూమి ఉందని ఆమె ఆరోపించారు. రిజిస్ట్రేషన్ సమయంలో తప్పులు జరిగాయని, ఆ భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆ భూమిలో వేసిన కంచెను కూడా తొలగించాలని కవిత కోరారు.

ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో భూవివాదాలు, నీటి అంశాలు, మరియు అంతరాష్ట్ర రాజకీయాలపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది.



# రేవంత్.. పోటీకొస్తవా..నువ్వో నేనో తేల్చుకుందాం

**మొదటిపేజీ తరువాయి**

మేము కూడా రెడీగా ఉన్నామన్నారు. మేము కూడా జై తెలంగాణ అని అన్నవాళ్లమే ఈట్ క జవాబ్ పత్తర్ సే దేంగే అన్నవాళ్లమేనన్నారు. మీరు ఒకటి అంటే మేము నాలుగు అనే స్థానంలో ఉన్నామని కానీ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాం కాబట్టి గౌరవప్రదంగా మాట్లాడుదామన్నారు. చేతనైతే గణాంకాల మీద చర్చించడానకి ఏ చౌరస్తాకు వస్తారో చెప్పండి మేమూ వస్తామన్నారు. 2014-15 లో వడ్లకు రూ.1300 ఉన్న ఎంఎస్పీ ఇప్పుడు రూ.2300 అయిందని తాము రైతుల కోసం పని చేస్తున్నామని చెప్పడానికి ఇది చాలన్నారు. ఇవాళ వరంగల్ జిల్లాలో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

**మొరిగే ప్రతీ కుక్కకు సమాధానం చెప్పనవసరం లేదు:**

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ బీజేపీనే విమర్శిస్తున్నాయని మండిపడ్డారు. అధికారం కోల్పోయిన వారికి తాము మళ్లీ రామని తెలుసని, అధికారంలో ఉన్నవారికి ఎన్నికలు వస్తే మళ్లీ అధికారంలోకి రామని తెలుసన్నారు. ఈ దేశానికి మరోసారి నరేంద్ర మోడీ ప్రధాని అవుతారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో మొరిగే ప్రతీ కుక్కకు సమాధానం చెప్పనవసరం లేదన్నారు. ఎన్నికల సంఘం వద్ద 6 వేలకు పైగా రాజకీయ పార్టీలు రిజిస్ట్రర్ అయి ఉన్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ వచ్చినా కాక్రోచ్ ఎర్త్ వామ్ పార్టీలు వచ్చినా మాకు ఏ సమస్య లేదన్నారు.

**రోజా మీకు పెండ బిర్యానీ పెట్టారా?**

తెలంగాణలో పవన్ కల్యాణ్ మీటింగ్ పై రద్దాంతం చేస్తున్న కవిత గతంలో బీఆర్ఎస్ పేరుతో వివిధ రాష్ట్రాల్లో తలదూర్చినప్పుడు ఎందుకు అడ్డు చెప్పలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టవచ్చు, పోటీ చేయవచ్చన్నారు. ఆంధ్ర బిర్యానీ పెండ బిర్యానీ అని గతంలో కేసీఆర్ అన్నారు. మరి రోజా ఇంటికి వెళ్లినప్పుడు మీకు ఆమె పెండ బిర్యానీ పెట్టిందా లేక మంచి బిర్యానీ పెట్టిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ మాట్లాడితే కరెక్ట్ మిగతా వాళ్లు మాట్లాడితే తప్పు అంటే ఎలా అన్నారు. పవన్ కల్యాణ్ ఆవేశపూరితంగా ఏం మాట్లాడారో నేను వినలేదన్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడితే ఎందుకంత ఉలిక్కి పడుతున్నారని ప్రశ్నించారు. వారి ఉనికికి ప్రమాదం వచ్చినప్పుడు అందరికి ప్రమాదం వచ్చినట్లు అనుకోవాలనుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అనే బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నారనే విషయం మరిచిపోవద్దని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సీఎం స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి గౌరవప్రదంగా మాట్లాడితే మీకు మాకు గౌరవంగా ఉంటుందన్నారు. అలా కాదని ఎవరు ఎక్కువగా బూతులు మాట్లాడుతారో పోటీ పెట్టుకుందామంటే మేము కూడా రెడీగా ఉన్నామన్నారు. మేము కూడా జై తెలంగాణ అని అన్నవాళ్లమే ఈట్ క జవాబ్ పత్తర్ సే దేంగే అన్నవాళ్లమేనన్నారు. మీరు ఒకటి అంటే మేము నాలుగు అనే స్థానంలో ఉన్నామని కానీ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాం కాబట్టి గౌరవప్రదంగా మాట్లాడుదామన్నారు. చేతనైతే గణాంకాల మీద చర్చించడానకి ఏ చౌరస్తాకు వస్తారో చెప్పండి మేమూ వస్తామన్నారు. 201415 లో వడ్లకు రూ.1300 ఉన్న ఎంఎస్పీ ఇప్పుడు రూ.2300 అయిందని తాము రైతుల కోసం పని చేస్తున్నామని చెప్పడానికి ఇది చాలన్నారు. ఇవాళ వరంగల్ జిల్లాలో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

**మొరిగే ప్రతీ కుక్కకు సమాధానం చెప్పనవసరం లేదు:**

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ బీజేపీనే విమర్శిస్తున్నాయని మండిపడ్డారు. అధికారం కోల్పోయిన వారికి తాము మళ్లీ రామని తెలుసని, అధికారంలో ఉన్నవారికి ఎన్నికలు వస్తే మళ్లీ అధికారంలోకి రామని తెలుసన్నారు. ఈ దేశానికి మరోసారి నరేంద్ర మోడీ ప్రధాని అవుతారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో మొరిగే ప్రతీ కుక్కకు సమాధానం చెప్పనవసరం లేదన్నారు. ఎన్నికల సంఘం వద్ద 6 వేలకు పైగా రాజకీయ పార్టీలు రిజిస్ట్రర్ అయి ఉన్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ వచ్చినా కాక్రోచ్ ఎర్త్ వామ్ పార్టీలు వచ్చినా మాకు ఏ సమస్య లేదన్నారు.

**రోజా మీకు పెండ బిర్యానీ పెట్టారా?**

తెలంగాణలో పవన్ కల్యాణ్ మీటింగ్ పై రద్దాంతం చేస్తున్న కవిత గతంలో బీఆర్ఎస్ పేరుతో వివిధ రాష్ట్రాల్లో తలదూర్చినప్పుడు ఎందుకు అడ్డు చెప్పలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టవచ్చు, పోటీ చేయవచ్చన్నారు. ఆంధ్ర బిర్యానీ పెండ బిర్యానీ అని గతంలో కేసీఆర్ అన్నారు. మరి రోజా ఇంటికి వెళ్లినప్పుడు మీకు ఆమె పెండ బిర్యానీ పెట్టిందా లేక మంచి బిర్యానీ పెట్టిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ మాట్లాడితే కరెక్ట్ మిగతా వాళ్లు మాట్లాడితే తప్పు అంటే ఎలా అన్నారు. పవన్ కల్యాణ్ ఆవేశపూరితంగా ఏం మాట్లాడారో నేను వినలేదన్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడితే ఎందుకంత ఉలిక్కి పడుతున్నారని ప్రశ్నించారు. వారి ఉనికికి ప్రమాదం వచ్చినప్పుడు



# జోరుగా డబుల్ బెడ్ రూమ్ దందా!!

**మొదటిపేజీ తరువాయి**

పరిస్థితులు ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేదలకు ఉచితంగా కేటాయించింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా కొందరు లబ్ధిదారులు, మధ్యవర్తులు, స్థానిక ప్రభావశీలుల అండతో ఈ ఇళ్లను అమ్మడం, అద్దెకు ఇవ్వడం, ఇతరులకు బదిలీ చేయడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ అవసరాలు, ఉద్యోగాల కారణంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని కొందరు బ్రోకర్లు ఈ అక్రమ వ్యాపారాన్ని నడుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యాపారంగా మార్చి లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు ప్రజల్లో ఆగ్రహం రేకెత్తిస్తున్నాయి.

అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, కేటాయించిన ఇళ్లలో అసలు లబ్ధిదారులు నివసిస్తున్నారా లేదా అనే విషయాన్ని పర్యవేక్షించాల్సిన వ్యవస్థ పూర్తిగా బలహీనపడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల తనిఖీల సమాచారం ముందుగానే చేరడంతో అక్రమాలు బయటపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకాలు కొందరి చేతుల్లో అక్రమ సంపాదనకు మార్గంగా మారితే ప్రభుత్వ లక్ష్యమే దెబ్బతింటుందని సామాజిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా డబుల్ బెడ్‌రూం కాలనీలపై ప్రత్యేక సర్వే నిర్వహించి, అక్రమంగా విక్రయించిన లేదా అద్దెకు ఇచ్చిన ఇళ్లను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.



అర్హులైన పేదలకు చేరాల్సిన ఇళ్లు అక్రమంగా ఇతరుల చేతుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి ప్రతి డబుల్ బెడ్‌రూం కాలనీపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

# నన్ను మభ్యపెట్టడం అంత ఈజీ కాదు

**మొదటిపేజీ తరువాయి**

తన లక్ష్యమని చెప్పారు. తాను కొద్ది మంది జర్నలిస్ట్‌లతో రాత్రి సమయంలో మాట్లాడతానని, పాలనపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటా అన్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాసినా చూస్తానని, దాని నుంచి కూడా కొంత సమాచారం వస్తుందన్నారు. పేదలు చెరువు పరిసరాలు ఆక్రమించుకున్నారు అంటే అర్థం చేసుకుంటానని.. కానీ పెద్ద వాళ్ళు కూడా చెరువులను అక్రమిస్తే ఎట్లా? అని ప్రశ్నించారు. హైడ్రా వచ్చాక.. ఎవరైనా ఇప్పుడు ధైర్యం చేస్తారా అడగండి. చెరువు కబ్జా చేయడానికి ఆలోచన చేస్తారేమో అని నిలదీశారు.

ఓ వైపు క్యాస్టిజం వద్దంటం. మరో వైపు.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వేరే హాస్టల్స్ పెడుతుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. "అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెడుతున్న. అందరూ అందులో చదువుకోవాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ అమలు చేసింది మేమే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయలేదు. ఓబీసీ జనాభా లెక్కలు కూడా లేవు. తెలంగాణలో ఆ లెక్కలు కూడా తేల్చేశాం. వెనకబాటు తనం, ఆర్థిక పరమైన అంశమే కాదు. విద్యా, సామాజిక అంశాలు. మేము పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. మేము పిల్లని ఇంటి నుంచి స్కూల్ వరకు వాహనాలు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ ఏడాది ప్రభుత్వం స్కూల్స్‌లో లక్ష మంది విద్యార్థుల సంఖ్య పెరిగింది. ట్రాన్స్‌పోర్టేషన్, బ్రేక్ఫాస్ట్, ఏర్పాటు చేస్తున్నాం. మా నాన్న రైతు. అందుకే మేము గోచి కడతాం పంచెలు, దోతీలు కూడా కడతాం. మా ఆహార్యం అలాగే ఉంటుంది. రాజశేఖర్ రెడ్డిని చూసి నేర్చుకోవాల్సిన అవసరం లేదు. రాజశేఖర్ రెడ్డి తెలంగాణ వ్యతిరేకి. ఫ్రెండ్లీ మ్యాచ్ లాగే.. నా పొరుగు రాష్ట్రాలతో ఉంటా. హైడ్రా లాంటి ఆలోచన అన్ని రాష్ట్రాలకు అవసరం లేదు. మెట్రో పాలిటన్ సిటీలకు అవసరం. మహిళా రిజర్వేషన్‌కి మేం హక్కుదారులం. మహిళను రాష్ట్రపతి, ముఖ్యమంత్రులను చేసింది మేమే. సోనియా గాంధీ మహిళలకు రిజర్వేషన్ కోసం ప్రయత్నం చేశారు. మోడీ పొలిటికల్ ఫార్ములా వాడుతున్నారు. మేము నియోజక వర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాదు. మోడీ చేస్తున్న ఆలోచనకి వ్యతిరేకం. తెలంగాణ, కర్ణాటకలో కూడా బీజేపీ ఎంపీలు గెలిచారు. కానీ కేంద్ర కేబినెట్‌లో ప్రధాన కేంద్ర మంత్రి పదవులు లేవు. ఢిల్లీలో దక్షణాది ఎంపీలు సెకండ్ గ్రేడ్ పీపుల్స్ లాగా చూడొద్దు అంటున్నాం." అని సీఎం వ్యాఖ్యానించారు.



# సింగరేణిలో భారీ కుంభకోణం..

**మొదటిపేజీ తరువాయి**

జి. కిషన్ రెడ్డికి కేటీఆర్ ఒక లేఖ రాశారు. సింగరేణిలోని పలు స్టాక్‌యార్డులలో బొగ్గు నిల్వల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం బొగ్గుపై సెస్, ఆదాయపు పన్ను చెల్లించినప్పటికీ, క్షేత్రస్థాయి తనిఖీల్లో నిల్వల మధ్య భారీ వ్యత్యాసం కనిపించిందని వివరించారు. ఈ వ్యవహారం వెనుక బొగ్గును అక్రమంగా తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన భారీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు.



ఈ కుంభకోణం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ హస్తం ఉందని, లేదా బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ మంత్రులకు మధ్య లోపాయికారీ సంబంధాలు ఉన్నాయేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ స్కామ్‌ను బయటపెట్టకుండా ఉండేందుకే తమ పార్టీ నేతలను అరెస్టు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

# చంద్రబాబుతో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు

**మొదటిపేజీ తరువాయి**

చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. "అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు.



ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' ధర్నా

స్పష్టం చేశారు. "మనం ఎవరికీ భయపడటం లేదని వారికి చెప్పండి. జైలుకు పంపుతారనే భయంతో చాలా మంది రాజీ పడి ఉండొచ్చు కానీ, ఈ దేశ విద్యార్థులు, యువత మాత్రం అమ్ముడుపోరు, లొంగిపోరు" అని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వానికి 7 రోజుల గడువు (అల్టిమేటం) విధిస్తున్నామని, ఈలోగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే, ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

**అమెరికా నుంచి వచ్చి నిరసన**

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే అమెరికా (బోస్టన్) నుంచి శనివారం ఉదయమే ఢిల్లీ చేరుకున్నారు. అయితే, తనకు స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్టుకు రావొద్దని, నేరుగా జంతర్ మంతర్ వద్దకే రావాలని శ్రేణులను కోరారు. భారత రాజ్యాంగ ప్రతిని ప్రదర్శిస్తూ ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు అనుమతి తీసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన తెలుపేందుకు పోలీసులు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు. దీంతో, నిరసన వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటలకు ఈ నిరసన ప్రదర్శన ప్రశాంతంగా ముగిసింది.

**వినూత్న నిరసన**

ఆందోళనకారులు బొద్దింకల మాస్కులు ధరించి, చేతుల్లో పూలు, పుస్తకాలు, జాతీయ జెండాలు, రాజ్యాంగ ప్రతులు, ప్లకార్డులు పట్టుకుని వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తం చేశారు. నిరసనలో పాల్గొన్న యువత అటు అధికార పక్షం బీజేపీతో పాటు ఇటు ప్రతిపక్షాలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తుకు సంబంధించిన విద్యా సమస్యలపై ఏ పార్టీలూ తగిన శ్రద్ధ పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల భవిష్యత్తు కోసం, విద్యావ్యవస్థలో జవాబుదారీతనం కోసం ఈ పోరాటం ముమ్మందు మరింత ఉధృతం అవుతుందని సీజేపీ ప్రతినిధులు చెప్పారు.

**సోనమ్ వాంగ్‌చుగ్ సంఘీభావం**

ప్రముఖ విద్యా సంస్కర్త, పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ స్వయంగా జంతర్ మంతర్ వద్దకు వెళ్లి నిరసనలో పాల్గొన్నారు. సీజేపీ కార్యకర్తలకు మద్దతు ప్రకటించారు. ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్, నటి అనీ రాజా (సీపీఐ), ప్రకాశ్ రాజ్, ఆదిత్య ఠాక్రే వంటి పలువురు రాజకీయ, సామాజిక అవగాహన ఉన్న ప్రముఖులు ఈ






ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. నిరసన తెలుపుతుండగా ఓ ఆరుగురు వ్యక్తులు అక్కడికి వెళ్లి ప్రభుత్వానికి మద్దతుగా, సీజేపీ ఉద్యమానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో, వారు ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

# శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

**నిజామాబాద్ జిల్లా, జూన్ 06(డీడీ9 వార్త) :**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆర్మూర్‌లోని శ్రీ సాయి గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాంతియుత వాతావరణం నెలకొన్న ప్రాంతాలే సత్వర అభివృద్ధిని సాధిస్తాయని శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, అనుమానితుల కదలికలను కనిపెట్టేందుకు వీలుగా ప్రతి కాలనీలో, ప్రతి వీధిలో ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్ నమ్మి వ్యక్తిగత సమాచారం అందించవద్దని, ఏదైనా అనుమానం వస్తే వెంటనే స్థానిక పోలీస్ అధికారిని లేదా విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను సంప్రదించాలని కోరారు. యువత మాదకద్రవ్యాలకు, ఇతర దురలవాట్లకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని హితవు పలికారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు పూర్తిస్థాయి భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర రెడ్డి, ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ గోనె హరి, వైస్ చైర్మన్ కాట్పల్లి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# ఎడపల్లిలో అక్రమ గ్యాస్ సిలిండర్ల వినియోగం

- **హోటళ్లపై పౌర సరఫరా శాఖ దాడులు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 06(డీడీ9 వార్త) :**

గృహ అవసరాల కోసం ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఎల్పిజి సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న సంస్థలపై పౌర సరఫరా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఎడపల్లి మండల కేంద్రంతో పాటు జానకంపేట్, ఎంఎస్సీ ఫారం, సాటపూర్ గేట్ ప్రాంతాల్లో అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలను అతిక్రమించి హోటళ్లు, ఇతర ఆహార వ్యాపార సంస్థల్లో ఉపయోగిస్తున్న 15 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సబ్సిడీ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు మళ్లించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు నిబంధనలు పాటించని సంబంధిత హోటల్ యజమానులపై అత్యవసర వస్తువుల చట్టం 6ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లను తదుపరి విచారణ నిమిత్తం స్థానిక గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. వ్యాపార సంస్థల నిర్వాహకులు చట్టబద్ధంగా వాణిజ్య గ్యాస్ కనెక్షన్లను మాత్రమే తీసుకోవాలని అక్రమ గ్యాస్ వాడకాన్ని పూర్తిగా అరికట్టేందుకు తనిఖీలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

# ధరల పెంపుతో రైతులపై పెనుభారం : ఏఐయూకేఎస్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 06(డీడీ9 వార్త) :**


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలను విపరీతంగా పెంచి రైతుల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు మార్కెట్‌లో యూరియా నిల్వలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనిbకనీస మద్దతు ధరల నిర్ణయంలో ప్రభుత్వం ఏమాత్రం రైతులకు మేలు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలు నామమాత్రంగా ఉన్నాయని, పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. ఇండోఅమెరికా వాణిజ్య ఒప్పందం దేశీయ వ్యవసాయ రంగానికి గొడ్డలిపెట్టుగా మారిందని, ఇది కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. ఏఐయూకేఎస్ జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు చేపట్టిన ఆందోళనల్లో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, అనంతరం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని, పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు ఉత్పత్తి ఖర్చులపై 50 శాతం లాభం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీపతి మల్లేష్, కాశ రవి, సుదర్శన్, హనుమాన్లు, ఎల్. గంగాధర్, వైద్యనాథ్, రెంజల్ గంగాధర్, నారాయణ, కొంద్ర లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.



# నాకు న్యాయం జరిగేది ఎన్నడు

**నిజామాబాద్ వర్ని/జూన్ 06/(డిడి9 వార్త)**

నిజామాబాద్ జిల్లా వర్ని మండలం కూనిపూర్ గ్రామ పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి తనకు కులం నుంచి కొంత మంది ఏలేశారు అని తనకు అన్యాయం జరుగుతుందని గత కొన్ని సంవత్సరాలు నుంచి న్యాయం కోసం ప్రభుత్వ కార్యాల చుట్టూ అధికార యంత్రాంగం చుట్టూ తిరుగుతున్న తనకు న్యాయం జరగడం లేదని వినతి పత్రాలు ఫుల్ గా ఇచ్చినప్పటికీ ఇప్పటికీ న్యాయం జరగలేదని రాజకీయ వివక్ష వల్ల తనకు న్యాయం జరగడం లేదని రాజకీయ ఆశక్తులు తనకు అన్యాయం చేస్తున్నారని ఇప్పటికైనా తనకు న్యాయం జరగాలని న్యాయం కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ చేస్తున్నప్పటికీ బాధితుడికి



న్యాయం జరిగేది ఎప్పుడూ అని గ్రామం చెందిన ఓ బాధితుడు తన బాధ ఇలా విన్నవించాడు.

# పిప్రి గ్రామంలో దగ్ధమైన నివాస గృహాన్ని పరిశీలించిన సీపీ

**నిజామాబాద్ జిల్లా, జూన్ 06(డీడీ9 వార్త) :**

ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన రాజమల్లు నివాస గృహాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, దానికి దారితీసిన పరిస్థితులను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన సీపీ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని కల్పించారు.
ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, దీని వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందేమోనన్న కోణంలో అన్ని అంశాలను లోతుగా విచారించాలని, బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. అగ్నిప్రమాదంతో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా మరియు ఇతర మార్గాల ద్వారా తక్షణ సహాయ సహకారాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను సేకరిస్తున్నామని విచారణ కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, ఆర్మూర్ ఎస్.హెచ్.ఓ సత్యనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ వేదిక

- **పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా, జూన్ 06(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లాలోని ప్రజల న్యాయపరమైన సమస్యలను త్వరితగతిన, సామరస్యంగా పరిష్కరించుకోవడానికి భారత ప్రభుత్వం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ చలానాలు, చిన్న చిన్న క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటి కేసులను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు.
కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవడానికి ఇది ఒక చక్కని వేదికని, శాంతియుతమైన రాజీ మార్గం ద్వారా ఇరుపక్షాల అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం వల్ల సమయం, శ్రమ ఆదా అవుతాయని పేర్కొన్నారు. కోర్టులలో కేసులను ఎదుర్కొంటున్న కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమస్యల నుండి విముక్తి పొందాలని పోలీస్ కమిషనర్ కోరారు.



# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి : సీపీ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా, జూన్ 06(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరం నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి బోర్గాం (పి) గ్రామంలో గల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన 'బాల పంచాయితీ' (పిల్లల పార్లమెంట్) కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నప్పటి నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం ఎంతో అవసరమని, ఇవి వారి భవిష్యత్తు ఎదుగుదలకు మరియు వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. బాల పంచాయితీ అనేది ఒక గ్రామంలోని పిల్లలందరూ కలిసి వారి జీవితాలను ప్రభావితం చేసే సమస్యలను చర్చించి, పరిష్కార మార్గాలను అన్వేషించే ఒక వేదిక అని, ఇది పిల్లల పార్లమెంట్‌లా పనిచేస్తుందని ఆయన వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా పిల్లల్లో బాధ్యత సహకారం మరియు నాయకత్వ పటిమ పెరుగుతాయని అన్నారు. ప్రతి బిడ్డ పాఠశాలకు వెళ్లే వాతావరణం సురక్షితంగా ఉండాలని, పిల్లల జీవితాలకు సంబంధించిన నిర్ణయాలలో వారిని కూడా భాగస్వాములను చేసినప్పుడే ఆదర్శవంతమైన గ్రామాలు సాధ్యమవుతాయని ఆయన ఆకాంక్షించారు. బాల పంచాయితీ వంటి కార్యక్రమాలు పిల్లలకు తమ గొంతును వినిపించే గొప్ప అవకాశాన్ని కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి శ్రీ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, నాల్గవ టౌన్ ఎస్.హెచ్.ఓ శ్రీ సతీష్ కుమార్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమ్మాజీ, కార్పొరేటర్ నరేష్, డి.సి.పి.ఓ శ్రీ చైతన్య, ఏ.హెచ్.టి.యు ఇన్‌స్పెక్టర్ శ్రీ సాయినాథ్, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి

- **విధులకు ఆటంకం కలిగించిన లారీ డ్రైవర్ అరెస్ట్**
- **డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 63 ఎంజీ ఆల్కహాల్ నమోదు**
- **కేసు నమోదు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలింపు**

**డిడి9 వార్త గుడిహత్నూర్**



జాతీయ రహదారిపై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్‌పై మద్యం మత్తులో దాడి చేసిన లారీ డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ సుభాష్ రెడ్డి ప్రభుత్వ ట్యాబ్‌తో కంటైనర్ ఫోటో తీయడానికి ప్రయత్నించగా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ విజయ్ కుమార్ గొడవకు దిగి కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని నెట్టివేసినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ దిలీప్ కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా 63 ఎంజీ శాతం ఆల్కహాల్ నమోదైంది. ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం, మద్యం మత్తులో వాహనం నడపడం వంటి ఆరోపణలపై కేసు నమోదు చేసి బోధ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ వెల్లడించారు.

# బషీరాబాద్‌లో విజయవంతంగా వరి సేకరణ

- **ఐకేపీ సీసీకి ఘన సన్మానం**

**నిజామాబాద్ జిల్లా, జూన్ 06(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో జరిగిన వరి ధాన్యం సేకరణ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో ఐకేపీ సీసీ పిర్యా నాయక్ ను శనివారం ఘనంగా సన్మానించారు. గ్రామంలో మొత్తం 108 లారీల ధాన్యాన్ని ఎటువంటి నష్టం వాటిల్లకుండా సేకరించడం జరిగింది. గతంలో అకాల వర్షాలు కురిసిన సమయంలో, ధాన్యం మొత్తం కల్లాల్లోనే ఉన్న పరిస్థితిలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి స్వయంగా రైతు కల్లాల వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. రైతుల కష్టాలను స్వయంగా చూసిన ఆయన, మోర్తాడ్‌లో ధర్నా చేపట్టి ప్రభుత్వ యంత్రాంగంపై ఒత్తిడి తీసుకురావడంతోనే అధికారులు స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. తమ సమస్యపై సత్వరమే స్పందించి, రైతులందరికీ మేలు చేసిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, సహకరించిన మండల, జిల్లా అధికారులకు బషీరాబాద్ గ్రామ రైతులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జమున మహేష్, ఉప సర్పంచ్ సీహెచ్ భూమేశ్వర్, కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు రమేష్, రాజు, శేఖర్, లావణ్య, రాకేష్, లక్ష్మి, రవి, శ్రీనివాస్ లతో పాటు గ్రామ స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**నిజామాబాద్ జిల్లా, జూన్ 06(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా గత వారం రోజులుగా కమిషనరేట్ పరిధిలోని అన్ని లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 194 మంది వాహనచోదకులు మద్యం మత్తులో పట్టుబడ్డారు. జూన్ 1వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన వారిని నిజామాబాద్, బోధన్ మరియు ఆర్మూర్ కోర్టులలో హాజరుపరచగా, న్యాయస్థానం వారిలో 6 గురికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించగా, మిగిలిన వారికి మొత్తం 11 లక్షల 60 వేల రూపాయల జరిమానా విధించడం జరిగింది. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనాల తనిఖీలను మరింత కఠినతరం చేశామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వాహనచోదకులకు ఆయన పలు కీలక సూచనలు చేస్తూ, ప్రాణాపాయకరమైన మద్యం తాగి వాహనాలు నడిపే పద్ధతిని మానుకోవాలని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్‌ను 6 నెలల పాటు సస్పెండ్ చేయడం జరుగుతుందని తెలిపారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్ వర్తించదని ఆయన స్పష్టం చేశారు. మైనర్లు మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడితే వారిపై మరియు వాహన యజమానులపై ఛార్జ్ షీట్ దాఖలు చేయడంతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఒకసారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడిన వారికి కఠిన కారాగార శిక్ష తప్పదని, మోటార్ వెహికల్ యాక్ట్ 2019 ప్రకారం మొదటిసారి పట్టుబడిన వారికి 10 వేల రూపాయల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష, రెండోసారి పట్టుబడిన వారికి 15 వేల రూపాయల జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తామని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, సురక్షితమైన ప్రయాణానికి సహకరించాలని పోలీస్ కమిషనర్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



DD9 వార్త
DD9 Vaartha
ఆదివారం
07-06-2026
హైదరాబాద్

# హీరోయిన్లను నిందించడం ఆపండి..



కన్నడ బ్యూటీ ఆషికా రంగనాథ్ తెలుగులో కూడా పలు సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో బిజీగా ఉన్న ఈ నటి, మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో కీలక పాత్రలో కనిపించనుంది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ పలు విషయాలపై తనదైన శైలిలో రియాక్ట్ అవుతోంది. తాజాగా ఆషికా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్ సినిమా ఇండస్ట్రీలో పెద్ద దుమారం రేపుతోంది. మూవీస్‌లో హీరోయిన్ల పాత్రలు, వారిపై వచ్చే విమర్శల గురించి ఆమె చాలా ఓపెన్‌గా మాట్లాడింది. హీరోయిన్ పాత్ర సరిగ్గా లేనప్పుడు విమర్శకులు నటీమణులపైనే నిందలు వేస్తారని ఆషికా రంగనాథ్ అన్నారు. "కథ రాసేటప్పుడే మహిళా పాత్రలను పక్కన పెట్టేయడం లేదా వాటిని సరిగ్గా డిజైన్ చేయకపోవడం అసలు సమస్య. అంతే తప్ప నటీమణుల తప్పు ఏమీ లేదు. డైరెక్టర్లు తమకు ఇచ్చిన పరిధిలోనే వాళ్ళు నటిస్తారు. రామ్ చరణ్ లేదా జూనియర్ ఎన్టీఆర్ వంటి పెద్ద స్టార్ల సరసన కేవలం డబ్బు కోసమే హీరోయిన్లు నటిస్తున్నారని కొందరు విమర్శిస్తుంటారు.

కానీ ఈ పెద్ద సినిమాల వెనుక ఉండే బిజినెస్ మార్కెట్ గురించి ఎవరూ ఆలోచించరు. ఇక నుంచి అయినా నిందించడం ఆపండి" అని ఆమె చెప్పారు. తెలుగు వంటి పెద్ద పాన్-ఇండియా సినిమాల్లో నటించడం అనేది హీరోయిన్లకు తమ నటనను నిరూపించుకునే అవకాశం కంటే, కెరీర్‌లో పైకి ఎదగడానికి ఒక ప్లాన్ లాంటిదని ఆషికా అభిప్రాయపడ్డారు. "భారీ యాక్షన్ సినిమాల్లో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ బొమ్మ లాగా మాత్రమే మారిపోతోంది. ఆమె పాత్రకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఇవ్వడం కంటే, హీరో ఇమేజ్‌ను మరింత పెంచేలాగే ఆ పాత్రలను జాగ్రత్తగా రాస్తున్నారు" అని ఆషికా రాసుకొచ్చారు. ఆషికా రంగనాథ్ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో దుమారం రేపుతున్నాయి.

టాలీవుడ్ యంగ్ ప్రొడ్యూసర్ నాగ వంశీ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఆయన ఇప్పటివరకు ఎన్నో సినిమాలను నిర్మించి, వాటిలో అనేక విజయాలు సాధించి భారీ లాభాలను పొందారు. అయితే ఇటీవల ఆయన నిర్మించిన కొన్ని చిత్రాలు బాక్స్ ఆఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో ఆయనకు ఒక సినిమా ద్వారా అనుకోకుండా పెద్ద లాభాలు దక్కుతున్నట్లు సమాచారం. తమిళ నటుడు సూర్య తాజాగా 'కరుప్పు' అనే చిత్రంలో హీరోగా నటించారు.

ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిష నటించగా, దర్శకత్వం ఆర్. జె. బాలాజీ వహించారు. సూర్య గతంలో చేసిన కొన్ని సినిమాలు వరుసగా ఫ్లాప్ కావడంతో పాటు, ఈ మూవీ ట్రైలర్ కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. దీంతో విడుదలకు ముందు ఈ సినిమాపై పెద్దగా అంచనాలు లేవు. అయితే విడుదలైన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ సినిమా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ, 300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి భారీ విజయాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం కూడా మంచి కలెక్షన్లు రాబడుతోంది.

ఈ విజయంతో సూర్య తదుపరి సినిమాలపై అంచనాలు పెరిగాయి. ప్రస్తుతం సూర్య, నాగ వంశీ నిర్మాణంలో రూపొందుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. 'కరుప్పు' భారీ విజయం సాధించడంతో 'విశ్వనాథ్ అండ్ సన్స్'పై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో ఈ సినిమా అన్ని రకాల హక్కులకు ముందుగా ఊహించిన దానికంటే ఎక్కువ ఆఫర్లు వస్తున్నట్లు సమాచారం. దీంతో నాగ వంశీకి అనుకోని అదృష్టం కలిసి వచ్చిందని ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## నాగవంశీకి అనుకోని అదృష్టం.. గట్టి జాక్‌పాట్ తగిలిందిగా



## సమాజంలో జరిగే విషయాలకు సినిమాలను నిందించొద్దు

సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందన్నారు నటి అనసూయ (Anasuya). సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

"ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తున్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను" అని అనసూయ చెప్పారు."సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం. సోషల్ మీడియాలో చాలామంది ముందుకువచ్చి ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టడం, కథల్లో పాత్రలను చూపించే విధానాలను ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని చూస్తుంటే నాకు నిజంగా సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు తప్పులను ప్రశ్నించడం అంటే సృజనాత్మకతపై దాడి చేయడం కాదు, అది సమాజంలో అవగాహన పెంచడం మాత్రమే" అని అనసూయ వివరించారు.

# హిట్ ఉమెన్ వచ్చేసింది

"గత 25రోజుల్లో ఇది మూడో హత్య. కానీ నగరానికి ఈ విషయం గురించి అవసరం లేదు. పోలీసులు, మీడియా దగ్గర సమాధానాలు లేవు. కానీ నేను చెప్తా ఆ హత్యల గురించి.. మా అక్కే హంతకురాలు" అని చెప్తోంది ఓ అమ్మాయి. మరి తన సోదరి హంతకురాలిగా ఎందుకు మారిందో తెలుసుకోవాలంటే 'బేబీ డూ డై డూ' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. దీనికి నాచికేత్ సమంత్ దర్శకత్వం వహిస్తున్నారు. సలీమ్ సిబ్లింగ్స్ సంస్థ నిర్మిస్తోంది. తాజాగా "మా హిట్ ఉమెన్ వచ్చేసింది" అనే వ్యాఖ్యతో ఈ సినిమా నుంచి గ్లింప్స్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది హ్యూమా. ఇందులో హంతకురాలిగా... సరికొత్త అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకుంటోందామె. వచ్చే నెల 3న ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం.



## ఆహారాన్ని కాదు.. విషాన్ని పండిస్తున్నాం'

'కల్తీ ఆహారం తిని అస్వస్థకు గురైన విద్యార్థులు', 'ఓ ప్రముఖ హోటల్‌లో కల్తీ నెయ్యితో ఆహార పదార్థాల తయారీ'.. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఎన్నో వార్తల్ని మన చూస్తూనే ఉన్నాం. ఈ రోజుల్లో వంటింట్లో వాడే నిత్యావసర సరుకుల నుంచి పిల్లలు తాగే పాల వరకూ ప్రతిదీ కల్తీనే. ఇప్పుడిదే అంశాన్ని తెరపైకి తీసుకురాబోతుంది కథానాయిక కాజల్. ఆమె, శ్రేయాస్ తల్పాడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ది ఇండియా స్టోరీ'. చెట్టన్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'సంఖ్యలు బహిరంగంగానే ఉన్నాయి. పరిణామాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. అయినా కూడా నిజం ఇంకా దాగి ఉన్నట్లు ఎందుకనిపిస్తోంద'నే వ్యాఖ్యను జోడించింది. పురుగు మందులను వినియోగించడం వల్ల ఎలాంటి నష్టాలు జరుగుతున్నాయి? కల్తీ ఆహార సమస్య ఎంత మంది ప్రాణాలను బలితీసుకుంటుందనే అంశాల ఆధారంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. "ఆహారాన్ని కాదు.. విషాన్ని పండిస్తున్నాం', 'ప్రతి ఏడాది 10లక్షల మందికి పైగా చనిపోతున్నారు".. అంటూ సాగుతున్న ఈ టీజర్ సినీప్రియుల్ని ఆకట్టుకుంటోంది. జులై 24న థియేటర్లలోకి రాబోతుందీ చిత్రం. ఇందులో న్యాయవాదిగా కనిపించనుంది కాజల్.



## జాన్వీ కపూర్ పాత్రపై డైరెక్టర్ బుచ్చిబాబు సంచలన వ్యాఖ్యలు!

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, టాలెంటెడ్ డైరెక్టర్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో వచ్చిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన ఈ రస్టిక్ హై ఎనర్జీ డ్రామా కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నప్పటికీ, సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ జాన్వీ కపూర్ క్యారెక్టరైజేషన్, ఆమెను స్క్రీన్‌పై చూపించిన విధానంపై ప్రేక్షకుల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ వివాదంపై దర్శకుడు బుచ్చిబాబు స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.


సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర ప్రెజెంటేషన్ చుట్టూ జరుగుతున్న చర్చపై బుచ్చిబాబు ఓ ఇంటర్వ్యూలో ఓపెన్ అయ్యారు. కొంతమంది ప్రేక్షకుల నుండి ఈ స్థాయిలో ప్రతికూల స్పందన వస్తుందని తాను అస్సలు ఊహించలేదని ఆయన అంగీకరించారు. సినిమాలో జాన్వీ పాత్ర కేవలం ఒక కమర్షియల్, గ్లామరస్ హంగులకే పరిమితమైందని, కొన్ని సీన్స్‌లో ఆమెను మితిమీరిన గ్లామరస్‌గా చూపించారంటూ ఒక వర్గం ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై



బుచ్చిబాబు మాట్లాడుతూ... "రామ్ చరణ్, జాన్వీ కపూర్ మధ్య ఒక ఆహ్లాదకరమైన, ఆట పట్టించే రొమాంటిక్ ట్రాక్‌ను చూపించాలనేదే మా ముఖ్య ఉద్దేశం. 'పెద్ది' ఒక పల్లెటూరి నేపథ్యంతో సాగే హైవోల్టేజ్ డ్రామా. ఆ కథాంశానికి, సినిమా మూడ్‌కు తగినట్లుగానే జాన్వీ పాత్రను డిజైన్ చేశాం. ఎవరినీ తక్కువ చేసి చూపించాలనే ఉద్దేశం మాకు లేదు, వివాదాలు సృష్టించడం మా లక్ష్యం కాదు" అని స్పష్టం చేశారు. ఇది నా రెండో సినిమా రాబోయే సినిమాలలో ఈ విషయం మీద కేర్ తీసుకుంటాను అని చెప్పుకొచ్చారు.

## రామాయణ, వారణాసి సినిమాల బడ్జెట్‌పై మనోజ్ భాజ్‌పేయి సంచలన వ్యాఖ్యలు

బాలీవుడ్ స్టార్ నటుడు మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ ఫైనాన్షియల్ థ్రిల్లర్ 'గవర్నర్' జూన్ 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన భారీ ప్రాజెక్ట్స్ రామాయణ, వారణాసిలపై వివాదాస్పద కామెంట్స్ చేసి వార్తల్లో నిలిచారు. ఎస్. ఎస్. రాజమౌళిమహేష్ బాబుల 'వారణాసి' (రూ. 1400 కోట్లు), రణ్‌బీర్ కపూర్ 'రామాయణ' (రూ. 4000 కోట్లు) వంటి అత్యంత భారీ బడ్జెట్‌పై మనోజ్ బాజ్‌పేయి స్పందిస్తూ.. ఇదంతా కేవలం ఒక పీఆర్ఎత్తుగడ మాత్రమేనని కొట్టిపారేశారు. గత 15 ఏళ్ల నుంచి ఇండస్ట్రీలో ఇలాంటి నెంబర్ల హడావుడిని తాను చూస్తున్నానని చెప్పారు. సినిమా అనేది పూర్తిగా నిర్మాతకు సంబంధించిన వ్యాపారమని, ఎంత ఖర్చు పెట్టాలి.. ఎంత వెనక్కి రాబట్టాలి అనేది కేవలం మేకర్స్ వ్యక్తిగత విషయమని అన్నారు. సాధారణ ప్రేక్షకులకు ఈ బడ్జెట్ లెక్కలతో ఎలాంటి సంబంధం లేదని, ఒక సినిమా చూశాక అది నచ్చిందా లేదా అనేదే ప్రేక్షకుడికి ముఖ్యం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు.



ఈ మధ్య కాలంలో సినిమా బిజినెస్ ట్రెండ్ ఎంతగా మారిపోయిందంటే.. చివరికి ఎయిర్‌పోర్టులో తనను కలిసే సామాన్య జనం కూడా మూవీ కథ గురించి కాకుండా, ఎన్ని కోట్లు వసూలు చేసింది... బాక్సాఫీసు కలెక్షన్స్ ఎంతొచ్చాయి అనే విషయాల గురించే మాట్లాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 500 కోట్లు లేదా రూ. 600 కోట్ల బడ్జెట్ పెట్టి సినిమా తీస్తే అందులోంచి ఒక్క రూపాయి కూడా ప్రేక్షకుల జేబుల్లోకి లేదా వారి బ్యాంక్ ఖాతాల్లోకి వెళ్లదని, ఆ డబ్బు అంతా నిర్మాత ఖాతాకే చెందుతుందని స్పష్టం చేశారు. కాబట్టి కలెక్షన్ల లెక్కలు పక్కనపెట్టి, కేవలం కంటెంట్ బాగుందా లేదా అనే కోణంలోనే సినిమాను చూడాలని అన్నారు. ప్రస్తుతం మనోజ్ బాజ్‌పేయి చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అయితే ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. మనోజ్ బాజ్‌పేయి నటించిన 'గవర్నర్' సినిమాకు మార్కెట్లో ఆశించినంత స్థాయిలో బజ్ ఏర్పడలేదని, అందుకే నెటిజన్ల దృష్టిని ఆకర్షించడానికి, తన సినిమా ప్రమోషన్ కోసం రాజమౌళి, రణ్‌బీర్ కపూర్ వంటి టాప్ సెలబ్రిటీల పెద్ద ప్రాజెక్టులను టార్గెట్ చేస్తూ ఆయన ఇలాంటి కామెంట్స్ చేశారంటూ కొందరు విమర్శిస్తున్నారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.